సాక్షి
కర్నూలు
ఆదివారం । 1 । జనవరి । 2023



కర్నూలులో ముఖేష్ కుమార్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా శనివారం కర్నూలు వచ్చారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆయనకు స్వాగతం పలికారు.



శ్రీశైల దేవస్థానానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి శనివారం గుంటూరుకు చెందిన లిఖిత విరాళాలు అందజేశారు. అన్నప్రసాదం, ప్రాణదానట్రస్ట్, గోసంరక్షణ నిధికి రూ.3.66 లక్షలు ఇచ్చారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.90
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:76.159
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:394
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,812

పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం

- నూతన సంవత్సర కానుకగా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కందిపప్పు, చక్కెరకు మాత్రమే డబ్బుల వసూలుకు నిర్ణయం



ఎండీయూ వాహనం ద్వారా నిత్యావసరాలను తీసుకుంటున్న ప్రజలు (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): ప్రజా పంపిణీ ద్వారా అందించే బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు కేజీ బియ్యానికి రూపాయి వసూలు చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం వేళ ఆ రూపాయి కూడా వసూలు చేయకుండా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది.

జిల్లాలో 6.59 లక్షల కార్డుదారులకు ఉపశమనం

కర్నూలు జిల్లాలో 6.59 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో దాదాపు 14 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో సభ్యుడికి 5 కేజీల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తారు. ఆ లెక్కన దాదాపు రూ.70 లక్షలను పేద ప్రజలను బియ్యం కోసం కేటాయించేవారు. ఈ క్రమంలో బియ్యాన్ని ఉచితంగా ఇస్తుండడంతో పేదలకు పెద్ద ఉపశమనం కలుగుతోంది.

కందిపప్పు, చక్కెరకు డబ్బులు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి కార్డు ద్వారా బియ్యంతోపాటు అరకేజీ చెక్కర, కేజీ కందిపప్పు ఇస్తారు. అందులో అరకేజీ చెక్కర కోసం రూ.17, కేజీ కందిపప్పు కోసం రూ.67.50 వసూలు చేస్తోంది. ఈ క్రమంలో నూతన సంవత్సర వేళ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కందిపప్పు, చక్కెరలకు మాత్రమే కార్డుదారులు డబ్బులు చెల్లించాలి. బియ్యాన్ని ఉచితంగా పొందవచ్చు.

రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవాలి



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1–15వ తేదీల మధ్య పేదలకు నిత్యావసరాలను ఎండీయూ వాహనాల ద్వారా వారి ఇళ్ల దగ్గరకే వెళ్లి అందజేస్తారు. గతంలో ఒకసారి మాత్రమే వేలిముద్ర వేస్తే బియ్యం, కందిపప్పు, చక్కెర ఇచ్చేవారు. అయితే ఈసారి నుంచి బియ్యాన్ని ఉచితంగా ఇస్తుండడంతోపాటు బియ్యం కోసం ఒకసారి, కందిప్పు, చక్కెరల కోసం మరోసారి కార్డుదారులు వేలిముద్రలు వేయాలి.

– ఎస్. రామసుందర్‌రెడ్డి, జేసీ

అందరికీ శుభాలు కలగాలి

కర్నూలు(సెంట్రల్): నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక, ఉపాధి కల్పన మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ గత ఏడాది కంటే మెరుగైన విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

కర్నూలు (రాజ్‌విహార్): ఉమ్మడి జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బి.వై.రామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ ఫోర్త్ వేవ్ మళ్లీ మొదలవుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు, పోలీసు సిబ్బంది

ఉత్తమ పోలీసులకు అవార్డులు

కర్నూలు: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచిన పోలీసులకు ఏడాది ముగింపు రోజు శనివారం పోలీసు శాఖ అవార్డును ప్రదానం చేసింది. కార్యక్రమానికి కలెక్టర్ కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ముఖ్య అతిథులుగా హాజరై పోలీసు సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు.

బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు అందుకున్నవారు...

- గోనెగండ్ల మండలం కున్నూరు గ్రామానికి చెందిన సిద్ధన్న హత్య కేసులో నిందితుడి అరెస్టుకు సాంకేతిక ఆధారాలతో సమాచారాన్ని సేకరించిన కోడుమూరు పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ కె.రామకృష్ణ
- 240 యూఐ కేసులు, పిటీ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించడంలో కృషి చేసినందుకు కర్నూలు తాలూకా పీఎస్ కానిస్టేబుల్ ఎం.కృష్ణ
- రూ.84 లక్షలు విలువ గల ప్రాపర్టీ రికవరీకి కృషి చేసినందుకు ఆదోని వన్‌టౌన్ పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ హాజీ బాషా
- సెక్యూరిటీ వింగ్ ఆపరేషన్స్‌లో అత్యుత్తమ పనితీరుకు ఏఆర్ ఆర్ఎస్ఐ సత్తార్
- జూనియర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా 50 చార్జిషీట్లను పూర్తి చేసినందుకు కర్నూలు తాలూకా పీఎస్‌కు చెందిన ఎస్.కరీం బాషా
- ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనితీరు కనబరచినందుకు ఎస్ఐ జి.మల్లికార్జున
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో ఓర్వకల్లు ఎస్ఐ ఎన్.మల్లికార్జున
- యూఐ కేసులు తగ్గించడంలో కృషి చేసినందుకు హాలహర్వి ఎస్ఐ విజయ్‌కుమార్
- పీడీ యాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బాగా చేసినందుకు ఆదోని త్రీటౌన్ సీఐ శ్రీరామ్
- లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో చేసిన కృషికి కర్నూలు తాలూకా సీఐ శేషయ్య
- ఓవరాల్ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ
- కర్నూలు టూటౌన్ పీఎస్‌ను బెస్ట్ పోలీస్‌స్టేషన్‌గా గుర్తించి సీఐ శ్రీనివాసులు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగేశ్వరరావు, ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ అజికల్, ఆర్‌టీఓ రమేష్, అసిస్టెంట్ డీఎం అండ్ హెచ్‌ఓ భాస్కర్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్, అడిషనల్ ఎస్పీలు ప్రసాద్, నాగబాబు, సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మేకల మహేష్ కుమార్, డీఎస్పీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పెరిగిన పత్తికొండ, కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు, పత్తికొండ సబ్ డివిజన్‌ల పరిధి పెరిగింది. వెలుర్తి, కృష్ణగిరి మండలాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ సబ్ డివిజన్‌లో ఉండేవి. ఈ రెండు మండలాలను పత్తికొండ సబ్ డివిజన్‌లో కలుపుతూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మండలాల ఏవోలు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్ ఆధ్వర్యంలో పనిచేస్తారు. ఓర్వకల్లు మండలం ఉమ్మడి జిల్లాలోని నందికొట్కూరు సబ్ డివిజన్‌లో ఉంది. ఈ మండలాన్ని కర్నూలు సబ్ డివిజన్‌లోకి చేర్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

3న కర్నూలులో అంధుల క్రీడా పోటీలు

కర్నూలు(అర్బన్): లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అంధులకు 3వ తేదీన క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పీ విజయ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీ క్యాంప్‌లోని జాతీయ అంధుల సమాఖ్య శిక్షణా కేంద్రం ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అంధ ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఈ నెల 3, 4వ తేదీల్లో ఓడీ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంధులైన ఉద్యోగులు తమ పై అధికారులకు తెలియజేసి ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె సూచించారు.













అటవీ శాఖ కన్జర్వేటర్ రామకృష్ణకు పదోన్నతి



చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న అటవీ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు సర్కిల్ సంరక్షణాధికారి (కన్జర్వేటర్) ఐఎఫ్ఎస్ పి.రామకృష్ణకు పదోన్నతి లభించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు కన్జర్వేటర్లకు ముఖ్య సంరక్షణాధికారులు (చీఫ్ కన్జర్వేటర్లు) గా పదోన్నతి కల్పించారు. అందులో కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ రామకృష్ణకు పదోన్నతి కల్పించి కర్నూలు సర్కిల్‌లోనే కొనసాగాలని ఉత్తర్వులు పేర్కొన్నారు. ముఖ్య సంరక్షణాధికారిగా పదోన్నతి పొందిన రామకృష్ణకు డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, కర్నూలు రేంజర్ సూర్య చంద్రరాజు, సోషల్ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసులు, సర్కిల్ కార్యాలయం మేనేజర్ అబ్దుల్ సుభాన్, సూపరింటెండెంట్ రామచంద్రరావు, టెక్నిల్ ఆఫీసర్ తిమ్మారెడ్డి, హెడ్ క్వాటర్స్ డీఆర్‌వో పీరయ్య, ఉద్యోగులు నాగేంద్ర, ఆదిల్ భాష, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్‌కు జైలు శిక్ష

కర్నూలు: కోవెలకుంట్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.సద్రుద్దిన్‌కు లంచం తీసుకున్న కేసులో మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ శనివారం ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది. ఉయ్యాలవాడ గ్రామ జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన రెడ్డిపల్లె బషీర్ అహ్మద్‌కు రావలసిన గ్రాట్యుటీ ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లును ప్రాసెస్ చేసి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసేందుకు గాను సద్రుద్దిన్ రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. 2016 సెప్టెంబర్ 7వ తేదీన ముద్దాయి సద్రుద్దిన్ ఫిర్యాదుదారు నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు నిఘా వేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా పూర్తి విచారణ జరిపి ముద్దాయికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
HEALTH, MEDICAL AND FAMILY WELFARE DEPARTMENT

(Notification No. 04/KNL/2022, dt. 31.12.2022)

RECRUITMENT TO (3) VACANT POSTS OF ECG TECHNICIAN AT GGH, KURNOOL/NANDYAL.

Applications are invited from the eligible candidates for recruitment to (3) vacant posts of ECG Technician at Govt. General Hospital, Kurnool/ Nandyal on Contract basis, through **"WALK-IN-INTERVIEW"**.

APPLICATION FORM and PROSPECTUS (Eligibility details, Roster Point details etc.) will be available in the Kurnool District website - https://kurnool.ap.gov.in and Nandyal District Website https://nandyal.ap.gov.in. from 02.01.2023 to 04.01.2023

Eligible candidates should download the APPLICATION FORM from the Kurnool District website - https://kurnool.ap.gov.in or Nandyal District Website https://nandyal.ap.gov.in and to attend for the **WALK-IN-INTERVIEW** in the Office of the Distrcit Medical and Health Officer, Kurnool on **04.01.2023** between 10.30 AM to 5.00 PM with the filled in APPLICATION FORM, along with all original Certificates/ documents and one set of Xerox copies of the same.

Sd/- Dr. B.Ramagiddaiah, District Medical & Health Officer, KURNOOL.	Sd/- Sri P.Koteswara Rao, IAS Collector & District Magistrate, KURNOOL.

GOVERNMENT OF ANDHRA PRADESH
MEDICAL AND HEALTH DEPT. KURNOOL DIST.

(NOTIFICATION NO. 04/UPHCs/NUHM/2022

RECRUITMENT OF POSTS OF STAFF NURSE, LAB TECHNICIAN GR II, PHARMASIST GR-II ON CONTRACT BASIS AND LAST GRADE SERVICE ON OUTSOURCING BASIS THROUGH APCOS

THROUGH WALK-IN-INTERVIEW.

***

Applications are invited from the eligible candidates and interested candidates for the post of STAFF NURSE, LAB TECHNICIAN GR II, PHARMASIST GR-II AND LAST GRADE SERVICE, to work in the UPHCs of Kurnool and Nandyal District as per RC. No. 111/SPMU-NUHM/2020, dt. 18.11.2022 and Dt: 07.12.2022 of the Director, H & FW, A.P. Vijawada.

Application Form, Roster Points and Eligibility details and other documents / details are available in the Kurnool District website - https://kurnool.ap.gov.in and Nandyal District Website https://nandyal.ap.gov.in. **from 02.01.2023.**

Eligible candidates should attend for the **WALK-IN-INTERVIEW** with the filled in prescribed Application Form, along with their original Certificates/ documents, in the O/o District Medical and Health Officer, Kurnool on **03.01.2023 (ONE DAY ONLY)** between 10.30 AM to 5.00 PM.

The applications reached after the last date will not accepted.

Sd/- DM & HO, KURNOOL.	Sd/- District Collector/ Chairman, District Selection Committee, Kurnool

4న జూనియర్ హాకీ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం గార్గేయపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 4వ తేదీన జిల్లా జూనియర్ హాకీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2003 జనవరి నెల తరువాత పుట్టిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో పోటీలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జూనియర్ హాకీ జట్టు 14 నుంచి 16 వరకు నంద్యాలలో నిర్వహించనున్న 12వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ జాలుర అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

4న మహిళల సీనియర్ హాకీ జట్టు ఎంపిక

గార్గేయపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 4వ తేదీన జిల్లా మహిళల సీనియర్ హాకీ జట్టు ఎంపిక చేస్తామని దాసరి సుధీర్ తెలిపారు.1994 జనవరి నెల తరువాత పుట్టిన వారు పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. ఎంపికైన జట్టు 13,14 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. వివరాలకు 7989043764 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.











అఫిలియేషన్‌కు 10 వరకు దరఖాస్తు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఇంటర్మీడియెట్ కాలేజీలు అఫిలియేషన్‌కు 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి అఫిలియేషన్ ఫీజు ఈ నెల 4వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.









నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్‌లో నకిలీ విత్తనాలు, అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని అఖిలపక్ష రైతుసంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో అఖిల పక్ష రైతుసంఘాల సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మల్లికార్జున, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, తెలుగురైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేశవరెడ్డి పాల్గొన్నారు. పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, లేక పోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

2 నుంచి పెన్షన్ పెంపు వారోత్సవాలు

కర్నూలు(టౌన్): జనవరి 2వ తేదీ నుంచి నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఖండేరీ వీధిలోని వివేకానంద సంస్కృత పాఠశాల, 3న కలెక్టరేట్‌లో పెన్షన్ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం 10 గంటలకు గఫూర్ నగర్‌లో, సాయంత్రం 4 గంటలకు రాంబొట్ల దేవాలయం, 5వ తేదీ ఉదయం 10 కు శరీన్‌నగర్ పార్కు, సాయంత్రం 4 కు ఉస్మానియా కళాశాల వద్ద ఉన్న షాదీఖానా గుమ్మజ్ వద్ద, 6వ తేదీ ఉదయం 10 గంటలకు వీకర్ సెక్షన్ కాలనీ నీళ్ల ట్యాంకు వద్ద ఉన్న ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో, సాయంత్రం 4 గంటలకు రామలింగేశ్వర్ నగర్ మున్సిపల్ పార్కు, 7వ తేదీ ఉదయం 10 గంటలకు స్టాంటన్‌పురం సచివాలయం, సాయంత్రం 4 గంటలకు చాణక్యపురి కాలనీలోని కుడా ఆఫీస్ ప్రాంగణంలో పెన్షన్ల పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
ఆదివారం ॥ 1-1-2023

2023 - ఆకాంక్షలు



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కాలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పలకాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్లిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకపక లాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.







* ఎంపిక

న్యూఇయర్ గిఫ్ట్

న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్త బుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.



పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.



క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.





రీ సైకింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యువెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. **ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.**

బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.



ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.

ముగ్గు ముచ్చట



21 చుక్కలు : 21 వరసలు



మద్దల పద్మావతి
పెందలవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు : 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు



2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంకె కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలపగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.

1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహంభావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, విద్యలో పూర్తి చేయని కోర్స్‌లు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్యలోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజయోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.


8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.

సాక్షి కర్నూలు

ఆదివారం । 1 । జనవరి । 2023



శ్రీమఠంలో బొమ్మనకట్ట పీఠాధిపతి

మంత్రాలయం: బొమ్మనకట్ట పీఠాధిపతి రఘువరేంద్రస్వామి శనివారం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అథ్లెటిక్స్‌లో స్వర్ణం

కర్నూలు (టౌన్): ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రెండో సంవత్సరం బీఏ చదువుతున్న చంద్రప్పగారి దేవి జిల్లా స్థాయి శాప్ లీగ్ అథ్లెటిక్స్‌లో స్వర్ణం సాధించింది. విద్యార్థిని ప్రిన్సిపాల్ కళావతి అభినందించారు.



పశుగ్రాసం రూ.15వేలు

బనగానపల్లె: ట్రాక్టర్ పశుగ్రాసం రూ.15వేలు ధర పలుకుతోంది. బనగానపల్లె ప్రాంతం నుంచి ప్రతి రోజు 50 ట్రాక్టర్ల వరకు పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి డోన్, కర్నూలు ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కోటి ఆశలతో.. కొంగొత్త ఆశయాలతో



కేకుల దుకాణం వద్ద సందడి

- అర్ధరాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- లక్ష్యాలు సాధించేందుకు చిత్తశుద్ధి అవసరమని నిపుణుల సూచన

కోటి ఆశలతో..కొంగొత్త ఆశయాలతో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నూతన సంవత్సరానికి ఉమ్మడి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ తదితర పట్టణాల్లో యువత జాలీగా గడిపారు. ఉత్సాహంగా 2023 సంవత్సరాన్ని ఆహ్వానించారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన పూల బొకేలు, దండలు

కర్నూలు కల్చరల్: కాలగర్భంలో మరో ఏడాది (2022) కనుమరుగైంది. నూతన సంవత్సరం 2023లోకి కొంగొత్త ఆశలతో అడుగుపెట్టాం. గతం మనకు కొంత మంచిని, కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. నూతనం అనే పదం కొత్తదనంతో పాటు భవిష్యత్ దర్శనానికి మార్గదర్శనం కావాలి. పాత అనే పదం భవిష్యత్ అనే భవనానికి పునాది కావాలి. పాత కొత్త కలయికలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవటం మనిషి లక్షణం కావాలి. గడిచిన సంవత్సరంలో కొన్ని మధుర జ్ఞాపకాలు, మరికొన్ని చేదు అనుభవాలు ఉంటాయి. చేదు అనుభవాలను గురువుగా భావించి మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది. ప్రకృతే మనిషికి పెద్ద పాఠశాల. ఈ సత్యాన్ని ప్రతి మనిషి గ్రహించి తన జీవితాన్ని తాను సంస్కరించుకోవాలి.

యువతపైనే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్న సంగతి అందరికి తెలిసిందే. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. నైతిక విలువలకు కట్టుబడి ఆదర్శ జీవితాన్ని గడపాలి. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పక్కలో ఏమి జరుగుతుందో కూడా పట్టించుకోని విధంగా మనిషిని తయారు చేస్తోంది. నూతన సాంకేతికత అవసరమే. అయితే దాన్ని మన ఉన్నతికి సోపానంగా మలచుకోవాలి. సామాజిక బంధాలను బలపర్చుకోవాలి.

మంచి పనులు చేయాలి



నూతన సంవత్సరం కొత్త ఆలోచనలు, ఆశలతో జీవించాలి. మంచి పనులనే వ్యసనాలుగా మార్చుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి. సంప్రదాయ బద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలి. యువతీ యువకులు ప్రణాళికాబద్ధంగా చక్కని మార్గంలో పయనిస్తూ ఉన్నతికి వెళ్లాలి. నిరాసక్తతను వదిలించుకొని ఆశావహంగా ముందుకు సాగాలి. జీవితంలో ఎదురైన పరాజయాలను అనుభవ పాఠాలుగా నేర్చుకొని విజయాలను సొంతం చేసుకోవాలి.

– డాక్టర్ మండి అన్వర్ హుసేన్, తెలుగు ఉపన్యాసకులు, ఉస్మానియా కళాశాల

ప్రతి రోజును నూతనంగా ఆస్వాదించాలి



ప్రతి రోజును నూతనంగా ఆస్వాదించాలి. కొంగొత్త జీవిత శిఖరాలను చేరుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. క్రమశిక్షణ, నిబద్ధత, కార్యదక్షత అన్నింటికి మించి ఆశాజనకంగా ముందుకు సాగితే కొత్త జీవితం ఆవిష్కృతమవుతుంది.

-సి. జ్యోతిర్మయి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

న్యూస్‌రీల్

నూతన సంవత్సరంలో అంతా మంచే జరగాలి

కర్నూలు(అర్బన్): నూతన సంవత్సరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రజలందరికీ మంచే జరగాలని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆకాంక్షించారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు తోడు సకాలంలో వర్షాలు కురవడం వల్ల ఇటు సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు రైతాంగం సంతోషంగా గడిపిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నూతన సంవత్సరంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆయన కోరారు.

తంగడంచ ఫారం అభివృద్ధికి కృషి



తంగడంచ ఫారంలో కందిపంటను పరిశీలిస్తున్న తిరుపాల్‌రెడ్డి, అధికారులు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం అభివృద్ధికి కృషిచేస్తానని ఏపీ వ్యవసాయశాఖ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తంగడంచ ఫారం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తంగడంచ ఫారానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఆచార్య ఎన్‌జీ రంగా ఏడీఆర్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఏడీఏ విజయశేఖర్, మాజీ సలహాదారుడు అంబటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ప్రాణాలకు హాని

బొమ్మలసత్రం: గంజాయి లాంటి మాదక ద్రవ్యాల ద్వారా ప్రాణాలకు హాని కలిగే అవకాశం ఉందని నంద్యాల జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని అయ్యలూరుమెట్ట సమీపంలో 20 కేజీల గంజాయిని ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కాల్చి ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డోన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన రూ. 7 లక్షల విలువగల 20 కేజీల గంజాయిని ధ్వంసం చేశామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ రమణ, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మల్లిఖార్జున, దస్తగిరిబాబు, ఎస్సైలు అశోక్, గంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి చకచకా ఏర్పాట్లు



ముస్తాబవుతున్న ఉత్తర ద్వారం

ఆళ్లగడ్డ: పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినానికి అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారు జాము నుంచే రాష్ట్రం నలుమూలలనుంచి సుమారు 50 వేల మంది భక్తులు క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వస్తారని ఆలయ అధికారుల అంచనా. ఎగువ, దిగువ అహోబిలేసుని దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి అవసరమైన పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఉత్తర ద్వారం నుంచి గుడి చుట్టు తాత్కాలిక క్యూలు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.

అంత్యక్రియల్లో పాల్గొనాలంటే డబ్బు ఇవ్వాల్సిందే!

డోన్ టౌన్: ఎవరైనా మృతి చెందితే ఆ కుల సంఘం నాయకులు దహన సంస్కారాలకు హాజరై ఆర్థికంగా చేయూతనివ్వడం చూస్తున్నాం. ఇందుకు విరుద్ధంగా అంతిమ సంస్కారాల్లో పాల్గొనాలంటే సంఘానికి డబ్బులు కట్టమని డిమాండ్ చేసిన సంఘటన డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. పాతబస్టాండ్‌లోని దుర్గమ్మ గుడి వద్ద బజ్జీలు బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్న లక్ష్మణరావు(58) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈయన భార్య గతంలోనే మృతి చెందింది. ప్రస్తుతం ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే అంత్యక్రియల్లో కులస్తులు ఎవ్వరూ పాల్గొన కూడదని కుల సంఘ పెద్దలు హుకుం జారీ చేసినట్లు మృతుని కుమార్తెలు కల్పనబాయ్, ఆదిలక్ష్మీబాయ్‌లు ఆరోపించారు. భవసార క్షత్రియ సంఘం నుంచి తమ తండ్రిని గతంలోనే బహిష్కరించారని, నష్ట పరిహారం చెల్లించాలని కోరడంతో స్థానికుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు వారు చెప్పారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ లవన్న



శ్రీశైలం సరిహద్దుల గుర్తింపు సర్వే పూర్తి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రం సరిహద్దులను గుర్తించేందుకు సర్వే , ల్యాండ్ రికార్డు, అటవీశాఖ, దేవస్థానం సంయుక్తంగా చేపట్టిన సమగ్ర భూసర్వే పనులు పూర్తయ్యాయి. భూ సర్వేనులకు సంబంధించిన సమీక్షా సమావేశం దేవస్థానం పరిపాలనా భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడు చదరపు మైళ్ల క్షేత్ర సరిహద్దులకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సమావేశంలో సర్వేశాఖ అధికారులు వీడియో డాక్యుమెంటేషన్ ద్వారా గుర్తించిన భూసర్వే సరిహద్దులను వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న మాట్లాడుతూ.. క్షేత్రానికి సరిహద్దులు గుర్తించేందుకు బైర్లూటిలోని ఎకోటూరిజం సెంటర్‌లో గతేడాది జూన్ 22 వ తేదీన మొదటి సమావేశం జరిగిందన్నారు. అనంతరం సెప్టెంబర్ 29న విజయవాడలో మంత్రులతో హైపవర్‌కమిటీ సమావేశం నిర్వహించి కూలంకుషంగా చర్చించారన్నారు. దేవస్థానం, అటవీశాఖ అధికారులతో పాటు మొత్తం 16 మంది జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డు శాఖ అధికారులు పాల్గొని సుమారు నెల రోజుల పాటు సమగ్ర భూసర్వే చేపట్టారన్నారు. సర్వే నిర్వహించిన అధికారులకు ఈఓ ప్రశంసాపత్రాన్ని, స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ హరికృష్ణ, శ్రీశైలం రేంజ్ అటవీశాఖ అధికారి నరసింహులు, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ రవి, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, రెవెన్యూ పర్యవేక్షకులు అయ్యన్న, దేవస్థానం రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

ప్యాపిలి: ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ఎలెక్టోరల్ పరిశీలకులు మురళీధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో 47వ నెంబర్ పోలింగ్ బూత్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఓటరు జాబితాను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డి , తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, బీఎల్వో హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ

జూపాడుబంగ్లా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని పోతులపాడు మజరా గ్రామమైన చాబోలు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో 19 మంది విద్యార్థులకు గాను ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ టీచర్లు ఉండటాన్ని గమనించిన ఆయన రేషనలైజేషన్ ప్రకారం ఓ ఉపాధ్యాయుడిని ఉంచి మరో ఉపాధ్యాయుడిని ఉన్నత విద్యాబోధనకు వినియోగించుకోవాలని డీఈఓ అనురాధకు సూచించారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. ఇంకా కొందరికి పాఠ్యపుస్తకాలు అందించలేదని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఎందుకివ్వలేదని డీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు.



ఉపాధ్యాయుడు అనిల్‌తో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాశ్

ఏపీ మోడల్ స్కూల్ పరిశీలన

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలును విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పరిశీలించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. గణితానికి సంబంధించిన అంశాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతో చదవాలని విద్యార్థులకు సూచించారు. వెంట డీఈఓ అనురాధ, ఎంఈఓ బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తదితరులు ఉన్నారు. అంతకు ముందు పారుమంచాల గ్రామంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని పరామర్శించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు

నందికొట్కూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యసిబ్బందిని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికి వైద్యం అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని సూచించారు. ఈయన వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఉమ్మడి జిల్లా ఏపీవీవీపీ కోఆర్డినేటర్ డాక్టరు రాంజీనాయక్, జఫ్రుల్లా, సీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కరివేన గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌ను ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రజలుక మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ వెంకటరమణ ఉన్నారు.



ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న కృష్ణబాబు

శ్రీశైలంలో రేపు ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీశైలాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో వేకువజామున స్వామిఅమ్మవార్ల ఉత్తరద్వార దర్శనం, రావణ వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపం ఉత్తర ద్వారం నుంచి వెలుపలకు తీసుకొచ్చి రావణ వాహనంపై ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. అదే రోజు మూడున్నర గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు జరిపించి 6 గంటల నుంచి భక్తులకు ఆర్జిత సేవలకు, దర్శనానికి అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన భద్రత... తగ్గిన నేరాలు

వినూత్న విధానాలతో జిల్లాలో నేరాల కట్టడి

- సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల ఛేదన
- మహిళా నేరాలు పూర్తిగా తగ్గుముఖం
- సెల్‌ఫోన్ రికవరీలో సేవలు భేష్
- పోలీసు వార్షిక నివేదిక విడుదల చేసిన ఎస్పీ



జిల్లా పోలీసు శాఖ వార్షిక నివేదికను విడుదల చేసి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో జిల్లా పోలీసులు ఈ ఏడాది పురోగతి సాధించారు. నేరాల తగ్గుదలకు తీసుకున్న అనేక చర్యలు సత్ఫలితాలిచ్చాయి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ పోలీసుల ద్వారా ముందస్తు సమాచారాన్ని సేకరించడం, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను త్వరితగతిన గుర్తించడం వల్ల నేరాల్లో గణనీయంగా తగ్గుదల కనిపించింది. దిశ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయడంతో మహిళా నేరాలు కూడా తగ్గాయి. జిల్లాను నేర రహితంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారు. గడచిన ఏడాదిలో పోలీసుల పనితీరు ఎంతో మెరుగయ్యిందని, పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూనే వారిని అభినందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు శాఖ వార్షిక నివేదిక-2022ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ జిల్లాలో నేరాలను నియంత్రించి శాంతిభద్రతలను సమర్థంగా పోలీసు శాఖ పరిరక్షిస్తుందని చెప్పారు. వినూత్న పోలీసింగ్ విధానాలతో 2022లో అన్ని రకాల నేరాలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన భద్రత అందించగలిగామని తెలిపారు.

సెల్‌ఫోన్ రికవరీలో సేవలు భేష్...

గతంలో ఫోన్ పోయిందంటే పోలీసులు పట్టించుకునేవారు కాదు. అటువంటిది సెల్‌ఫోన్ల చోరీలు, ఎక్కడైనా జారవిడుచుకున్న కేసులకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రత్యేక యాప్‌ను రూపొందించడంతో మూడు నెలల వ్యవధిలోనే 2,431 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రెండు విడతలుగా మొబైల్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు అప్పగించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారికి కూడా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ మేళాలో వారికి అందజేశారు.

రూ.4.57 కోట్ల సొత్తు రికవరీ...

2021లో 583 కేసులు నమోదు కాగా, అందులో ఛేదించినవి 230 కేసులు మాత్రమే. ఈ ఏడాది 507 కేసులు నమోదు కాగా, 473 కేసులు ఛేదించి రూ.4.57 కోట్లు సొత్తును రికవరీ చేశారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల రాజీలో రాష్ట్రంలో ప్రథమ స్థానం...

పెండింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. 2021లో 14,847 కేసులు, 2022లో 7,202 కేసులు కలిపి మొత్తం 22,049 కేసులు పెండింగ్‌లో ఉండగా లోక్ అదాలత్ ద్వారా 19,652 కేసులు రాజీ కుదిర్చి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లా పోలీసు శాఖ నిలిచింది. ప్రస్తుతం కేవలం 2,391 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

4.47 లక్షల మంది దిశ యాప్ డోన్‌లోడ్...

దిశ ఎస్ఓఎస్ యాప్ ద్వారా మహిళల భద్రత, రక్షణ కోసం, ఆపద సమయాల్లో ఉన్నప్పుడు వారి లొకేషన్ ట్రాకింగ్ చేయడానికి బాధిత మహిళలు పౌరుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేసేందుకు వారి నుంచి రక్షణ పొందడానికి జిల్లాలో ఇప్పటి వరకు 4.47 లక్షల మంది మహిళల చేత యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ ఏడాది దిశ కాల్ సెంటర్‌కు 388 ఫిర్యాదులు అందాయి. సకాలంలో స్పందించి వాటన్నింటినీ పోలీసులు పరిష్కరించారు. అలాగే సచివాలయ మహిళా పోలీసుల ద్వారా సర్వే నిర్వహించి 577 కుటుంబాల సమస్యలను పరిష్కరించారు. అందులో 390 భూ వివాదాలు, 11 కమ్యూనల్, 5 పొలిటికల్, 50 మంది యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌కు సంబంధించిన అంశాలు 1121 గుర్తించి మొత్తం 1041 సమస్యలను పరిష్కరించారు. జిల్లాలో 620 సచివాలయ పోలీసులు లోకల్ పోలీసులకు సహాయంగా పనిచేస్తున్నారు.

ఎస్పీ వెల్లడించిన ప్రధానాంశాలు మరికొన్ని...

కర్నూలు సేఫ్ సిటీ...

ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడానికి ఈ ఏడాది ఆగస్టులో కర్నూలు సేఫ్ సిటీ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు 13 పెట్రోలింగ్ బృందాలు ఉండగా వాటి సంఖ్య 40కి పెంచి రాత్రి గస్తీ ముమ్మరం చేసి 102 బీట్ పాయింట్లు ఉన్న సంఖ్యను 335కు పెంచి ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కార్యక్రమాలు నిర్వహించి 2,794 మందిని అరెస్టు చేసి 435 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

సాంకేతిక నైపుణ్యతలో శిక్షణ...

పెండింగ్ కేసులను భారీగా తగ్గించేందుకు జూనియర్ ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు విడతల వారీగా నిర్వహించారు. శిక్షణకు ముందు 65 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు మాత్రమే దర్యాప్తు అధికారులుగా ఉండేవారు. ఐదు నెలల వ్యవధిలో 271 మంది పోలీస్ జూనియర్ ఇన్వెస్టిగేషన్ అధికారులుగా తీర్చిదిద్ది దర్యాప్తులను వేగవంతం చేశారు. అలాగే 270 మంది పోలీసు సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ఫామ్స్, రికార్డులను అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక శిక్షణ ఇప్పించారు.

ఉత్తమ సేవల గుర్తింపు...

విధులలో పోలీసు సిబ్బంది ప్రతిభను గుర్తించడానికి, ఉత్తమ సేవలను పెంపొందించడానికి 21 మందికి వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు, 5 మందికి ప్రశంసాపత్రాలు, 72 మందికి క్యాష్ రివార్డులు, 71 మందికి గుడ్ సర్వీస్ ఎంట్రీలు అందజేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు...

కర్నూలులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో 57 మంది సిబ్బంది ఉండగా సంఖ్యను 113కు పెంచి మైక్ సెట్లతో ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహనతో పాటు ఐదేళ్లలో స్పీడ్ నియంత్రణ సూచికలు, డ్రమ్ములతో బార్ కేడ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.

సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి...

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో నాటుసారా నిర్మూలనకు పోలీసు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తయారీ రవాణాదారులను గుర్తించి 66 మందికి ఉపాధి అవకాశాలు, పునరావాసం కోసం రూ.54 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే 12 మంది సారా తయారీ రవాణాదారులపై పీడీ యాక్టు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

తగ్గిన రోడ్డు ప్రమాద మరణాలు...

పోలీసులు తీసుకున్న చర్యల వల్ల ఈ ఏడాది రోడ్డు ప్రమాద మరణాలు తగ్గాయి. 2021లో 342 మరణాలు జరుగగా 2022లో వాటి సంఖ్య 325కు తగ్గింది. అలాగే 2021లో 164 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కాగా, 2022లో వాటి సంఖ్య 151కి తగ్గింది. అలాగే అత్యాచారం, ఫోక్సో కేసులు 2021లో 73 నమోదు కాగా, 2022లో 57కు తగ్గింది.

పెరిగిన సైబర్ నేరాలు...

సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు కేసులను ఛేదిస్తుండగా అదే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు. 2021లో 44 కేసులు నమోదు కాగా 2022లో 58 కేసులు నమోదయ్యాయి. అలాగే హత్య కేసుల సంఖ్య కూడా ఈ ఏడాది పెరిగింది. 2021లో 38 నమోదు కాగా, 2022లో కేసుల సంఖ్య 41కి పెరిగింది.

అవ్వాతాతలకు 'నూతన' కానుక

- పెంచిన రూ.2,750 పింఛన్ నేడు అందజేత
- ఆర్థిక భారమైనా హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- వృద్ధుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



కర్నూలు(అగ్రికల్చర్): నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అవ్వాతాతల పింఛన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2750కి పెంచి అందజేస్తోంది. 2022 డిసెంబరు నెలలో ఉమ్మడి జిల్లాలో పింఛన్ల సంఖ్య 4,48,620(కర్నూలు 235713, నంద్యా ల 212907)కి చేరింది.వీటిని రూ.114.60 కోట్లు పంపిణీ చేశారు. 2023 జనవరిలో పింఛన్ల సంఖ్య 4,62,561కి చేరింది. వీటికి రూ.128,08,14,250 పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. టీడీపీ హయాంలో (2019 మే నెలలో) ఉమ్మడి జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 3,90,612 మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 4,62,561కి పెరిగింది. టీడీపీ హయాంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో 71,949 పింఛన్లు పెరిగాయి.

ఉదయం 5 గంటల నుంచే పంపిణీ

వైఎస్ఆర్ పెన్షన్ కానుకను 1వ తేదీ ఉదయం 5 గంటలకే పంపిణీ చేయనున్నారు. బ్యాంకుల నుంచి అవసరమైన నగదును వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేసుకున్నారు. నూతన సంవత్సరం మొదటి రోజునే ఉదయం ఐదు గంటలకే గ్రామ, వార్డు వలంటీర్లు అవ్వాతాతలకు, అక్కలు, వికలాంగులు, ఇతర అన్ని వర్గాల వారికి గుడ్ మార్నింగ్ చెప్పి పెంచిన పింఛన్ అందజేయనున్నారు.

అర్హులందరికీ పింఛన్

అర్హులందరికీ వైఎస్ఆర్ పెన్షన్ కానుక ఇవ్వాలనేదే ప్రభుత్వం ఉద్దేశం. దీనిపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి నోటీసులు ఇవ్వడం, తగిన అర్హత ఉంటే యథాతథంగా పింఛన్ ఇవ్వడం సర్వసాధారణమే. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 9,169 మందికి, నంద్యాల జిల్లాలో 6,824 మందికి నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇవ్వడమంటే పింఛన్ తీసేసినట్లు కాదని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. కర్నూలు జిల్లాలో 8,721 పింఛన్లపై వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయింది. ఇందులో 5,868 మందికి యథావిధిగా ఫించన్‌లు పొందే అవకాశం పొందింది.నంద్యాల జిల్లాలో 6,289 పింఛన్లను వెరిఫై చేయగా 5,421 మందికి అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరు యథాతథంగా ఫించన్‌లు పొందుతారు.868మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారు.

జనవరి 1 నుంచి వారోత్సవాలు...

పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.2750కి పెంచడం, భారీగా కొత్త పింఛన్లు భారీగా మంజూరు కావడంతో జనవరి 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. మండలం, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వారోత్సవాలు జరుగుతాయి. సంబంధిత ఎమ్మెల్యేలు ఇచ్చే తేదీలను బట్టి 1 నుంచి 7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తారు. వారోత్సవాల నిర్వహణకు మండలాలకు రూ.10వేలు, మున్సిపాలిటీలకు రూ.15 వేలు, కార్పొరేషన్‌కు రూ.50 వేల ప్రకారం ఖర్చు చేయనున్నారు.

పింఛన్ యథాతథంగా వచ్చింది



కొన్నేళ్లుగా వితంతు ఫించన్ వస్తోంది. అయితే నా కుమారుడు శివకుమార్ ఆధార్ నంబరు ఆరుగురి విద్యుత్ మీటర్లకు లింక్ అయింది. వారు ఎవరో మాకు తెలియదు. విద్యుత్ వినియోగం ఎక్కువగా కనిపించడంతో అధికారులు మాకు నోటీసు ఇచ్చారు. నా కుమారుడు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఇతరుల మీటర్లకు ఆధార్ లింక్‌ను తీసివేయించారు. దీంతో పింఛన్‌కు పూర్తి అర్హత వచ్చింది. యథాతథంగా ఫించన్ పొందే అవకాశం వచ్చింది.

– పుల్లెద్దుల మారెమ్మ, లక్ష్మీనగర్, కర్నూలు

ఆనందంగా ఉంది



ప్రభుత్వం వితంతు ఫించన్ మంజూరు చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. నా భర్త కొన్ని నెలల క్రితం మరణించాడు. మాది రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం. భర్త మరణించిన ఐదారు నెలల్లోనే వితంతు ఫించన్ మంజూరు అయింది. ఫించన్ కోసం ఏ రాజకీయ నాయకుడి దగ్గరకు పో లేదు. మద్దూరు నగర్‌లోని వార్డు సచివాలయంలో ఫించన్ కోసం దరఖాస్తు సమర్పించాం. ఎవ్వరికి ఒక్క రూపాయి ఇవ్వకుండానే సకాలంలో ఫించన్ మంజూరు అయింది. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాను.

– ఎం.మేరీ, పాల కొట్టాల, కర్నూలు

అర్హులెవ్వరికీ అన్యాయం జరుగదు



వైఎస్ఆర్ పెన్షన్ కానుక అర్హులందరికీ లభిస్తుంది. ఇందులో ఎలాంటి రాజకీయాలు, సిఫారస్సులు అవసరం లేదు. జిల్లాలో 9,169 మందికి నోటీసులు ఇవ్వ గా,6000 మందికి అర్హత ఉన్నట్లు నిర్ధారణ అ యింది. వీరందరికి యథాతథంగా పింఛన్లు పంపిణీ అవుతాయి.

– వెంకటసుబ్బయ్య, పీడీ, డీఆర్‌డీఏ, వైకేపీ

క్లుప్తంగా

క్రీడాకారిణికి సత్కారం



క్రీడాకారిణి హారికను సత్కరిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలాలో నిర్వహించిన ఎన్ఐఎస్ రెగ్యులర్ డిప్లొమాలో జాతీయస్థాయిలో మొదటి అథ్లెటిక్స్ క్రీడాకారిణి హారిక మొదటి స్థానం సాధించింది. మంచి ప్రతిభ కనబరచిన ఆమెను శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సీఈఓ రమణ తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. సీఈఓ మాట్లాడుతూ క్రీడాకారిణి నుంచి క్రీడా శిక్షకురాలిగా రాణించిన హారిక ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం సభ్యులు విజయ్‌కుమార్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ను అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అయ్యప్ప మాలధారులు

కర్నూలు(సెంట్రల్): అయ్యప్పస్వామిని కించపరచేలా మాట్లాడిన వరంగల్ జిల్లా కొడంగల్‌కు చెందిన బైరి నరేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని అయ్యప్పమాలధారులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. శనివారం వందలాది మంది అయ్యప్ప స్వాములు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి నరేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

150 పందులకు స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్



కర్నూలు(అగ్రికల్చర్): పందుల మరణాలను అరికట్టేందుకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ శనివారం ప్రారంభించింది. పశుసంవర్ధకశాఖ అధికారులే క్షేత్రస్థాయికి వెళ్లి పందులకు వ్యాక్సిన్‌లు వేయడం విశేషం. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాకు స్వైన్ ఫీవర్ వాక్సిన్ 6వేల డోసులు వచ్చాయి. బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు తదితరులు నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని జొహరాపురం రోడ్డు ప్రాంతానికి వెళ్లి పీపీకిట్స్ ధరించి వ్యాక్సిన్ వేశారు. యజమానులు పట్టి తెచ్చిన 150 పందులకు స్వైన్‌ఫీవర్ వ్యాక్సిన్ చేసినట్లు జిల్లా జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య తెలిపారు. కర్నూలుకు 2500, ఆదోనికి 1500, నంద్యాలకు 2000 డోసుల ప్రకారం వ్యాక్సిన్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 7వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురంలో ప్రారంభించిన వైఎస్సార్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పోటీల్లో 58 జట్లు పాల్గొనగా నెలరోజుల పాటు అట్టహాసంగా జరిగాయి. మెగా క్రికెట్ టోర్నీలో గెలుపొందిన జట్లకు బహుమతులు, మెమెంటోలను కర్నూలు నగర మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. విన్నర్స్‌గా నిలిచిన బుల్లెట్ లెవెన్స్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్స్‌గా నిలిచిన గార్గేయపురం జట్టుకు రూ.20 వేలు, మూడవ స్థానంలో నిలిచిన మండ్లెం జట్టుకు రూ.10 వేలు నగదు అందజేశారు.

కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మురళి ఓ వివాహితకు ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడు. ఆయన వేధింపులు తాళలేక బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై గ్రామ సభలు

కొత్తపల్లి: మండలంలో కొక్కెరంచ, పెద్దగుమ్మడాపురం, కొత్తపల్లి, శివపురం గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామాభివృద్ధి ప్రణాళికపై గ్రామ సభలు నిర్వహించారు. కొత్తపల్లిలో జరిగిన గ్రామసభలో ఈఓఆర్డీ శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిష్కరించాల్సిన ముఖ్య సమస్యలను ఎలా గుర్తించాలి అనే వాటిపై అవగాహన కల్పించారు. శివపురంలో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ శివన్న ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలు, పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అవ్యక్త మధురం.. గోదాదేవి భక్తితత్వం



ధనుర్మాస పూజల్లో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ

కర్నూలు కల్చరల్: అవ్యక్త మధురం గోదాదేవి భక్తి తత్వమని తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. నగర శివారు మాసమసీదు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల్లో శనివారం ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు సందేశ మిచ్చారు. గోదా దేవి ఆచరించి చూపిన భక్తి మార్గాన్ని భక్తులు అందరూ ఆచరించి అనుభూతి చెందాలన్నారు. గోదా గోకులం నిర్వహిస్తున్న గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, ఆయన శిష్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో గోదా గోకులం సభ్యులు పల్లెర్ల నాగరాజు, పాలాది సుబ్రహ్మణ్యం, సుధాకర్, సురేష్, రవి ప్రకాష్, సురేష్‌రాజు, చిత్రాల వీరయ్య, కరివెన నిత్యాన్నదాన సత్రాల అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్‌శర్మ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, పెద్దటేకూరు రుక్మిణీ పాండురంగ స్వామి పీఠాధిపతులు ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

సోనోవిజన్ బ్రాంచ్ మేనేజర్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

కర్నూలు(లీగల్): సోనోవిజన్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ శుక్రవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కర్నూలు ఎ.క్యాంప్‌కు చెందిన జి.రంగారెడ్డి సి.క్యాంప్‌లోని సోనోవిజన్ షోరూమ్‌లో 2021, మార్చి 25న రూ.6,200 వెచ్చించి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌కు చెందిన కూలర్ కొనుగోలు చేశాడు. ఈ సమయంలో లక్కీడ్రా పేరుతో షోరూమ్ నిర్వాహకులు కూపన్లు ఇచ్చారు. ఈ లక్కీడ్రాలో మొదటి విజేతకు మారుతీ ఆల్టో కారు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే లక్కీడ్రాను సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనవరిలో పూర్తి చేయగా.. వినియోగదారులను మభ్యపెడుతూ అవే కూపన్లను దాదాపు రెండు నెలల తర్వాత మార్చిలో జారీ చేశారు. ఈ మేరకు వినియోగదారుడు తనకు కాలం చెల్లిన కూపన్లు ఇచ్చి మోసం చేశారంటూ సోనోవిజన్‌కు లీగల్ నోటీసు జారీ చేశారు. అయితే ఈ నోటీసుకు సోనోవిజన్ నిర్వాహకులు జవాబు ఇస్తూ తాము కాలం చెల్లిన కూపన్లు ఇచ్చింది వాస్తవమేనని అంగీకరించారు. తమ నుంచి డబ్బు రాబట్టడానికే వినియోగదారుడు ఇదంతా చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో రంగారెడ్డి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన వినియోగదారుల కమిషన్ 2022 అక్టోబర్ 17వ తేదీన వినియోగదారుడికి రూ.4.50 లక్షలు లేదా కొత్త కారు ఇవ్వాలని సోనోవిజన్‌ను ఆదేశించింది. సోనోవిజన్ కమిషన్ ఉత్తర్వులను పాటించకపోవడంతో వినియోగదారుడు మరలా ఈ ఉత్తర్వుల అమలుకు కమిషన్‌లో పిటీషన్ చేసుకున్నాడు. సోనోవిజన్ వారు కమిషన్ నోటీసులు అందుకుని కూడా జవాబు ఇవ్వకపోవడంతో కమిషన్ 2022 డిసెంబర్ 30న సోనోవిజన్ బ్రాంచ్ మేనేజర్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2023 డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లను జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లాపరిషత్‌లోని చైర్మన్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ ముద్రించిన డైరీ, క్యాలెండర్లు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. డైరీలో ముద్రించిన జీవోల పుస్తకం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదాసిర్ అహ్మద్, నాయకులు గోవిందు, నాగరాజు, శేఖర్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.



కళావాహిని సాంస్కృతిక కళా సంస్థ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేఈ కృష్ణమూర్తి

కర్నూలు కల్చరల్: కళావా ని సాంస్కృతిక కళా సంస్థ క్యాలెండర్ –2023ను మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణ మూర్తి ఆయన స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో పరమ పదించిన ప్రముఖ కళాకారులు, ప్రస్తుత కళాకారుల ఫొటోలతో ప్రచురించడం అభినందనీయమన్నారు. కళాకారుల పట్ల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్ బాబుకు ఉన్న అభిమానం వ్యక్తం అవుతుందన్నారు. సీనియర్ కళాకారులు దస్తగిరి, తిరుపాలు, నాగేశ్వరరావు, ఆనందరావు, అనంత శర్మ, వెంకటేశ్వర్లు, హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సేఫ్ సిటీ కోసం ఏర్పాటు చేసిన రాత్రి గస్తీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

నగరంలో రాత్రి గస్తీ కట్టుదిట్టం

- పోలీస్ పెట్రోలింగ్ కోసం సేఫ్ సిటీ లింక్ క్లిక్ చేయండి : ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: రాత్రి పెట్రోలింగ్‌ను మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉంటే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి http://kurnoolpolice.in/safecity లింక్‌ను క్లిక్ చేసి పోలీసు పెట్రోలింగ్ చేయాలని కోరితే సేఫ్ సిటీ పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలని కర్నూలు నగర ప్రజలకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. కర్నూలు కొండారెడ్డిబురుజు దగ్గర శనివారం రాత్రి గస్తీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కర్నూలు సేఫ్ సిటీ కోసం 22 రాత్రి గస్తీ వాహనాలను నియమించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కూడా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రాత్రి గస్తీ బీట్ పాయింట్‌ను 102 నుంచి 335కు పెంచి ఏడు సెక్టార్లలో 22 చిన్నచిన్న సబ్‌రూట్స్‌గా విభజించి డీఎస్పీ స్థాయి అధికారికి గస్తీని పర్యవేక్షించేందుకు బాధ్యతలు అప్పగించారు. రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు ఈ వాహనాలపై పోలీసులు గస్తీ తిరుగుతారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, కర్నూలు డీఎస్పీ మహేష్, సీఐలు తబ్రేజ్, శంకరయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డితో పాటు పలువురు ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ముజఫర్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 81వ వార్డు సచివాలయం పరిధిలోని గోవర్ధన్‌నగర్, గంగావతి నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతు... సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. గడప గడప వస్తుండగా ప్రజలు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, 21వ వార్డు ఇన్‌చార్జ్ వైజా బాలచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, పర్ల సుంకన్న, గోపినాథ్, ముల్లా హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులే కార్పొరేషన్‌కు వెన్నెముక



కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న మేయర్ రామయ్య

- మేయర్ బీవై రామయ్య

కల్లూరు: పారిశుద్ధ్య కార్మికులే మున్సిపల్ కార్పొరేషన్‌కు వెన్నెముక అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని నగర పాలక సంస్థలో పని చేస్తున్న 1,173 మంది పారిశుద్ధ్య కార్మికులకు శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో మిఠాయి బాక్సులను పంపిణీ చేశారు. ఆయా వార్డులో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో స్థానిక కార్పొరేటర్లు పంపిణీ చేయగా 19వ వార్డులోని పని చేస్తున్న కార్మికులకు మేయర్ అందజేశారు. అలాగే నగర పాలక సంస్థ ఉన్నతాధికారులకు, కార్పొరేటర్లకు మేయర్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ చిరు కానుకలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే అధికారులు, సిబ్బంది, కార్మికులను కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామన్నారు. విజయాలు వచ్చిన, పండుగలు వచ్చినా కార్మికులతో కలసి వేడుకలను జరుపుకుంటామన్నారు. నూతన సంవత్సరంలో కూడా వారి భాగస్వామ్యంతోనే మరింతగా నగరాభివృద్ధికి అడుగులు పడేలా చూస్తామన్నారు.

రీసర్వే సక్రమంగా నిర్వహించాలి

రుద్రవరం: భూ రీసర్వే పనులు సక్రమంగా చేయాలని తహసీల్దార్ వెంకటశివ సూచించారు. మండలంలోని టి.లింగందిన్నె, శ్రీరంగాపురం గ్రామాల్లో కొన్నిరోజులుగా రీసర్వే పనులు సాగుతున్నాయి. శనివారం తహసీల్దార్ పరిశీలించి వీఆర్‌ఓలు సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. రైతులు తమ పొలాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను అందజేస్తే, హద్దులను నిగ్గ తేల్చి, హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తారని చెప్పారు. డీటీ మహబూబ్‌బాషా ఉన్నారు.

'కృష్ణా' బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానది నీటి నిర్వహణ, జలాల వినియోగంపై వివాదాలను పరిష్కరించేందుకు కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటైందన్నారు. విభజన చట్టం ప్రకారం ఈ బోర్డు ప్రధాన కేంద్రం ఏపీలో ఉందన్నారు. 2020 వరకు హైదరాబాద్ కేంద్రంగా కొనసాగిన బోర్డును రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమేనని, అయితే బోర్డును విశాఖలో ఏర్పాటు చేయడం సరికాదని, కర్నూలులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కాగా బోర్డును కర్నూలులో ఏర్పాటయ్యేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి బుగ్గన హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మిడుతూరు: లబ్ధిదారులు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా నాగలూటి జగనన్న కాలనీ లే అవుట్‌లో నిర్మాణాలను పరిశీలించారు. ఏఓ దశరథరామయ్య, హౌసింగ్ ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ బాషా ఉన్నారు.

శంకరవరప్రసాద్ సేవలు మరువలేనివి

మహానంది: దేవస్థానం ఈఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన శంకరవరప్రసాద్ సేవలు మరువలేనివని మహానంది ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రిటైర్డ్ ఈఓ శంకరవరప్రసాద్ మృతికి శనివారం నివాళులర్పించారు. దేవస్థానం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సే వలను గుర్తుచేసుకున్నారు. ఆలయ ప్రధానా ర్చకు లు అర్జున శర్మ, ఏఈఓ మధు, ధర్మకర్త మల్లికార్జున,సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టమాటా కిలో రూ.5



జూపాడుబంగ్లా: వారం క్రితం వరకు కిలో టమాటా ధర రూ.25 వరకు పలికింది. కాగా శనివారం పట్టణంలో కిలో రూ.5 ప్రకారం విక్రయించారు. శనివారం 80బన్నూరు వారాంతపు సంతలో కూడా కిలో రూ.5కే విక్రయించారు. దీంతో కొనుగోలుదారులు అధికంగా కొనుగోలు చేశారు. మార్కెట్లో మిగిలిన కూరగాయల కన్నా టమాటాలు అధికంగా అమ్ముడుబోయాయని వ్యాపారులు పేర్కొన్నారు.

గస్తీని పరిశీలించిన ఎస్పీ



కర్నూలు (న్యూటౌన్): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులలో బుల్లెట్ వాహనంపై తిరిగి శనివారం అర్ధరాత్రి గస్తీని పరిశీలించారు. కర్నూలు పట్టణంలోని పాతబస్టాండ్, రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్, బిర్లాగేట్, సి.క్యాంపు, నంద్యాల చెక్ పోస్ట్ మీదుగా సీ క్యాంప్ కలెక్టరేట్, రాజ్ విహార్ మీదుగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ఆయా ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ పర్యటించి పరిశీలించారు. పలు చోట్ల పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సేఫ్ సిటీ లక్ష్యంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట కర్నూలు పట్టణ డీఎస్పీ మహేష్ , కర్నూలు టూ, టౌన్ సీఐ శ్రీనివాసులు, మూడవ పట్టణ సీఐ మహమ్మద్ తబ్రేజ్, కర్నూలు నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య ఉన్నారు.

నయా జోష్

కర్నూలు నగరంలో యువకులు నూతన సంవత్సర సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి బాణాసంచా పేలుస్తూ.. కేకులు కట్‌చేస్తూ ఒకరికొకరు హ్యాపీ న్యూఇయర్ చెప్పుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసభరితంగా సందడిచేశారు. – కర్నూలు (న్యూటౌన్)



క్లుప్తంగా

క్రీడాకారిణికి సత్కారం



క్రీడాకారిణి హారికను సత్కరిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలాలో నిర్వహించిన ఎన్ఐఎస్ రెగ్యులర్ డిప్లొమాలో జాతీయస్థాయిలో మొదటి అథ్లెటిక్స్ క్రీడాకారిణి హారిక మొదటి స్థానం సాధించింది. మంచి ప్రతిభ కనబరచిన ఆమెను శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సీఈఓ రమణ తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. సీఈఓ మాట్లాడుతూ క్రీడాకారిణి నుంచి క్రీడా శిక్షకురాలిగా రాణించిన హారిక ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం సభ్యులు విజయ్‌కుమార్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భైరి నరేష్‌ను అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అయ్యప్ప మాలధారులు

కర్నూలు(సెంట్రల్): అయ్యప్పస్వామిని కించపరచేలా మాట్లాడిన వరంగల్ జిల్లా కొడంగల్‌కు చెందిన భైరి నరేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని అయ్యప్పమాలధారులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. శనివారం వందలాది మంది అయ్యప్ప స్వాములు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి నరేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

150 పందులకు స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్



పందులకు వ్యాక్సిన్ వేస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పందుల మరణాలను అరికట్టేందుకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ శనివారం ప్రారంభించింది. పశుసంవర్ధకశాఖ అధికారులే క్షేత్రస్థాయికి వెళ్లి పందులకు వ్యాక్సిన్‌లు వేయడం విశేషం. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాకు స్వైన్ ఫీవర్ వాక్సిన్ 6వేల డోసులు వచ్చాయి. బహుళార్ధ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు తదితరులు నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని జొహరాపురం రోడ్డు ప్రాంతానికి వెళ్లి పీపీకిట్స్ ధరించి వ్యాక్సిన్ వేశారు. యజమానులు పట్టి తెచ్చిన 150 పందులకు స్వైన్‌ఫీవర్ వ్యాక్సిన్ చేసినట్లు జిల్లా జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య తెలిపారు. కర్నూలుకు 2500, ఆదోనికి 1500, నంద్యాలకు 2000 డోసుల ప్రకారం వ్యాక్సిన్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 7వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురంలో ప్రారంభించిన వైఎస్సార్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పోటీల్లో 58 జట్లు పాల్గొనగా నెలరోజుల పాటు అట్టహాసంగా జరిగాయి. మెగా క్రికెట్ టోర్నీలో గెలుపొందిన జట్లకు బహుమతులు, మెమోంటోలను కర్నూలు నగర మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. విన్నర్స్‌గా నిలిచిన బుల్లెట్ లెవెన్స్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్స్‌గా నిలిచిన గార్గేయపురం జట్టుకు రూ.20 వేలు, మూడవ స్థానంలో నిలిచిన మండ్లెం జట్టుకు రూ.10 వేలు నగదు అందజేశారు.

అవ్యక్త మధురం.. గోదాదేవి భక్తితత్వం

కర్నూలు కల్చరల్: అవ్యక్త మధురం గోదాదేవి భక్తి తత్వమని తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. నగర శివారు మాసమసీదు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల్లో శనివారం ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు సందేశమిచ్చారు. గోదా దేవి ఆచరించి చూపిన భక్తి మార్గాన్ని భక్తులు అందరూ ఆచరించి అనుభూతి చెందాలన్నారు. గోదా గోకులం నిర్వహిస్తున్న గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, ఆయన శిష్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో గోదా గోకులం సభ్యులు పల్లెర్ల నాగరాజు, పాలాది సుబ్రహ్మణ్యం, సుధాకర్, సురేష్, రవి ప్రకాష్, సురేష్‌రాజు, చిత్రాల వీరయ్య, కరివెన నిత్యాన్నదాన సత్రాల అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్‌శర్మ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు 'నూతన' కానుక

- పెంచిన రూ.2,750 పింఛన్ నేడు అందజేత
- ఆర్థిక భారమైనా హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- వృద్ధుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



కర్నూలు(అగ్రికల్చర్): నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అవ్వాతాతల పింఛన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2750కి పెంచి అందజేస్తోంది. 2022 డిసెంబరు నెలలో ఉమ్మడి జిల్లాలో పింఛన్ల సంఖ్య 4,48,620(కర్నూలు 235713, నంద్యాల 212907)కి చేరింది.వీటిని రూ.114.60 కోట్లు పంపిణీ చేశారు. 2023 జనవరిలో పింఛన్ల సంఖ్య 4,62,561కి చేరింది. వీటికి రూ.128,08,14,250 పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. టీడీపీ హయాంలో (2019 మే నెలలో) ఉమ్మడి జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 3,90,612 మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 4,62,561కి పెరిగింది. టీడీపీ హయాంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో 71,949 పింఛన్లు పెరిగాయి.

ఉదయం 5 గంటల నుంచే పంపిణీ

వైఎస్ఆర్ పెన్షన్ కానుకను 1వ తేదీ ఉదయం 5 గంటలకే పంపిణీ చేయనున్నారు. బ్యాంకుల నుంచి అవసరమైన నగదును వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేసుకున్నారు. నూతన సంవత్సరం మొదటి రోజునే ఉదయం ఐదు గంటలకే గ్రామ, వార్డు వలంటీర్లు అవ్వాతాతలకు, అక్కలు, వికలాంగులు, ఇతర అన్ని వర్గాల వారికి గుడ్ మార్నింగ్ చెప్పి పెంచిన పింఛన్ అందజేయనున్నారు.

అర్హులందరికీ పింఛన్

అర్హులందరికీ వైఎస్ఆర్ పెన్షన్ కానుక ఇవ్వాలనేదే ప్రభుత్వం ఉద్దేశం. దీనిపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి నోటీసులు ఇవ్వడం, తగిన అర్హత ఉంటే యథాతథంగా పింఛన్ ఇవ్వడం సర్వసాధారణమే. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 9,169 మందికి, నంద్యాల జిల్లాలో 6,824 మందికి నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇవ్వడమంటే పింఛన్ తీసేసినట్లు కాదని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. కర్నూలు జిల్లాలో 8,721 పింఛన్లపై వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయింది. ఇందులో 5,868 మందికి యథావిధిగా ఫించన్‌లు పొందే అవకాశం పొందింది.నంద్యాల జిల్లాలో 6,289 పింఛన్లను వెరిఫై చేయగా 5,421 మందికి అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరు యథాతథంగా ఫించన్‌లు పొందుతారు.868మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారు.

జనవరి 1 నుంచి వారోత్సవాలు...

పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.2750కి పెంచడం, భారీగా కొత్త పింఛన్లు భారీగా మంజూరు కావడంతో జనవరి 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. మండలం, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వారోత్సవాలు జరుగుతాయి. సంబంధిత ఎమ్మెల్యేలు ఇచ్చే తేదీలను బట్టి 1 నుంచి 7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తారు. వారోత్సవాల నిర్వహణకు మండలాలకు రూ.10వేలు, మున్సిపాలిటీలకు రూ.15 వేలు, కార్పొరేషన్‌కు రూ.50 వేల ప్రకారం ఖర్చు చేయనున్నారు.

పింఛన్ యథాతథంగా వచ్చింది



కొన్నేళ్లుగా వితంతు ఫించన్ వస్తోంది. అయితే నా కుమారుడు శివకుమార్ ఆధార్ నంబరు ఆరుగురి విద్యుత్ మీటర్లకు లింక్ అయింది. వారు ఎవరో మాకు తెలియదు. విద్యుత్ వినియోగం ఎక్కువగా కనిపించడంతో అధికారులు మాకు నోటీసు ఇచ్చారు. నా కుమారుడు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఇతరుల మీటర్లకు ఆధార్ లింక్‌ను తీసివేయించారు. దీంతో పింఛన్‌కు పూర్తి అర్హత వచ్చింది. యథాతథంగా ఫించన్ పొందే అవకాశం వచ్చింది.

– పుల్లెద్దుల మారెమ్మ, లక్ష్మీనగర్, కర్నూలు

ఆనందంగా ఉంది



ప్రభుత్వం వితంతు ఫించన్ మంజూరు చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. నా భర్త కొన్ని నెలల క్రితం మరణించాడు. మాది రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం. భర్త మరణించిన ఐదారు నెలల్లోనే వితంతు ఫించన్ మంజూరు అయింది. ఫించన్ కోసం ఏ రాజకీయ నాయకుడి దగ్గరకు పో లేదు. మద్దూరు నగర్‌లోని వార్డు సచివాలయంలో ఫించన్ కోసం దరఖాస్తు సమర్పించాం. ఎవ్వరికి ఒక్క రూపాయి ఇవ్వకుండానే సకాలంలో ఫించన్ మంజూరు అయింది. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాను.

– ఎం.మేరి, పాల కొట్టాల, కర్నూలు

అర్హులెవ్వరికీ అన్యాయం జరుగదు



వైఎస్ఆర్ పెన్షన్ కానుక అర్హులందరికీ లభిస్తుంది. ఇందులో ఎలాంటి రాజకీయాలు, సిఫారస్సులు అవసరం లేదు. జిల్లాలో 9,169 మందికి నోటీసులు ఇవ్వగా,6000 మందికి అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరందరికి యథాతథంగా పింఛన్లు పంపిణీ అవుతాయి.

– వెంకటసుబ్బయ్య, పీడీ, డీఆర్‌డీఏ, వైకేపీ



నయా జోష్

కర్నూలు నగరంలో యువకులు నూతన సంవత్సర సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి బాణాసంచా పేలుస్తూ.. కేకులు కట్‌చేస్తూ ఒకరికొకరు హ్యాపీ న్యూఇయర్ చెప్పుకున్నారు. ఆటపాటలతో సందడిచేశారు.

– కర్నూలు (న్యూటౌన్)

కార్మికులే కార్పొరేషన్‌కు వెన్నెముక



కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న మేయర్ రామయ్య

- మేయర్ బీవై రామయ్య

కల్లూరు: పారిశుద్ధ్య కార్మికులే మున్సిపల్ కార్పొరేషన్‌కు వెన్నెముక అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని నగర పాలక సంస్థలో పని చేస్తున్న 1,173 మంది పారిశుద్ధ్య కార్మికులకు శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో మిఠాయి బాక్సులను పంపిణీ చేశారు. ఆయా వార్డులో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో స్థానిక కార్పొరేటర్లు పంపిణీ చేయగా 19వ వార్డులోని పని చేస్తున్న కార్మికులకు మేయర్ అందజేశారు. అలాగే నగర పాలక సంస్థ ఉన్నతాధికారులకు, కార్పొరేటర్లకు మేయర్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ చిరు కానుకలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే అధికారులు, సిబ్బంది, కార్మికులను కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామన్నారు. విజయాలు వచ్చిన, పండుగలు వచ్చినా కార్మికులతో కలసి వేడుకలను జరుపుకుంటామన్నారు. నూతన సంవత్సరంలో కూడా వారి భాగస్వామ్యంతోనే మరింతగా నగరాభివృద్ధికి అడుగులు పడేలా చూస్తామన్నారు.

నగరంలో రాత్రి గస్తీ కట్టుదిట్టం

- పోలీస్ పెట్రోలింగ్ కోసం సేఫ్ సిటీ లింక్ క్లిక్ చేయండి : ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



గస్తీని పర్యవేక్షిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: రాత్రి పెట్రోలింగ్‌ను మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉంటే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి http://kurnoolpolice.in/safecity లింక్‌ను క్లిక్ చేసి పోలీసు పెట్రోలింగ్ చేయాలని కోరితే సేఫ్ సిటీ పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలని కర్నూలు నగర ప్రజలకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. కర్నూలు కొండారెడ్డిబురుజు దగ్గర శనివారం రాత్రి గస్తీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కర్నూలు సేఫ్ సిటీ కోసం 22 రాత్రి గస్తీ వాహనాలను నియమించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కూడా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రాత్రి గస్తీ బీట్ పాయింట్‌ను 102 నుంచి 335కు పెంచి ఏడు సెక్టార్లలో 22 చిన్నచిన్న సబ్‌రూట్స్‌గా విభజించి డీఎస్పీ స్థాయి అధికారికి గస్తీని పర్యవేక్షించేందుకు బాధ్యతలు అప్పగించారు. రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు ఈ వాహనాలపై పోలీసులు గస్తీ తిరుగుతారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, కర్నూలు డీఎస్పీ మహేష్, సీఐలు తబ్రేజ్, శంకరయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డితో పాటు పలువురు ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గస్తీని పరిశీలించిన ఎస్పీ

కర్నూలు (న్యూటౌన్): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులలో బుల్లెట్ వాహనంపై తిరిగి శనివారం అర్ధరాత్రి గస్తీని పరిశీలించారు. కర్నూలు పట్టణంలోని పాతబస్టాండ్, రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్, బిర్లాగేట్, సి.క్యాంపు, నంద్యాల చెక్ పోస్ట్ మీదుగా సీ క్యాంప్ కలెక్టరేట్, రాజ్ విహార్ మీదుగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ఆయా ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ పర్యటించి పరిశీలించారు. పలు చోట్ల పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సేఫ్ సిటీ లక్ష్యంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట కర్నూలు పట్టణ డీఎస్పీ మహేష్, కర్నూలు టూ, టౌన్ సీఐ శ్రీనివాసులు, మూడవ పట్టణ సీఐ మహమ్మద్ తబ్రేజ్, కర్నూలు నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య ఉన్నారు.

భూసంరక్షణ విభాగం డీడీగా వెంకటేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ భూ సంరక్షణ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా డి.వెంకటేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఏవో, ఏడీఏలు అభినందించారు.

సోనోవిజన్ బ్రాంచ్ మేనేజర్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

కర్నూలు(లీగల్): సోనోవిజన్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ శుక్రవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కర్నూలు ఎ.క్యాంప్‌కు చెందిన జి.రంగారెడ్డి సి.క్యాంప్‌లోని సోనోవిజన్ షోరూమ్‌లో 2021, మార్చి 25న రూ.6,200 వెచ్చించి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌కు చెందిన కూలర్ కొనుగోలు చేశాడు. ఈ సమయంలో లక్కీ డ్రా పేరుతో షోరూమ్ నిర్వాహకులు కూపన్లు ఇచ్చారు. ఈ లక్కీడ్రాలో మొదటి విజేతకు మారుతీ ఆల్టో కారు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే లక్కీడ్రాను సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనవరిలో పూర్తి చేయగా.. వినియోగదారులను మభ్య పెడుతూ అవే కూపన్లను దాదాపు రెండు నెలల తర్వాత మార్చిలో జారీ చేశారు. ఈ మేరకు వినియోగదారుడు తనకు కాలం చెల్లిన కూపన్లు ఇచ్చి మోసం చేశారంటూ సోనోవిజన్‌కు లీగల్ నోటీసు జారీ చేశారు. అయితే ఈ నోటీసుకు సోనోవిజన్ నిర్వాహకులు జవాబు ఇస్తూ తాము కాలం చెల్లిన కూపన్లు ఇచ్చింది వాస్తవమేనని అంగీకరించారు. తమ నుంచి డబ్బు రాబట్టడానికే వినియోగదారుడు ఇదంతా చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో రంగారెడ్డి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన వినియోగదారుల కమిషన్ 2022 అక్టోబర్ 17వ తేదీన వినియోగదారుడికి రూ.4.50 లక్షలు లేదా కొత్త కారు ఇవ్వాలని సోనోవిజన్‌ను ఆదేశించింది. సోనోవిజన్ కమిషన్ ఉత్తర్వులను పాటించకపోవడంతో వినియోగదారుడు మరలా ఈ ఉత్తర్వుల అమలుకు కమిషన్‌లో పిటీషన్ చేసుకున్నాడు. సోనోవిజన్ వారు కమిషన్ నోటీసులు అందుకుని కూడా జవాబు ఇవ్వకపోవడంతో కమిషన్ 2022 డిసెంబర్ 30న సోనోవిజన్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ముజఫర్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 81వ వార్డు సచివాలయం పరిధిలోని గోవర్ధన్‌నగర్, గంగావతి నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతు... సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. గడప గడప వస్తుండగా ప్రజలు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, 21వ వార్డు ఇన్‌చార్జ్ వైజా బాలచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, పర్ల సుంకన్న, గోపినాథ్, ముల్లా హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

4,5 తేదీల్లో కేంద్ర కమిటీ పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించేందుకు జనవరి 4, 5 తేదీల్లో సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ పర్యటించనున్నట్లు డ్వామా పీడీ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం కేంద్ర కమిటీ పర్యటనపై తన చాంబరులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సలహాదారు, సెంట్రల్ పబ్లిక్ సెక్టారు ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ అమర్జీత్ సిన్హా నేతృత్వంలో మొత్తం ఐదుగురు సభ్యులు ఉన్న ప్రత్యేక టీమ్ జిల్లాకు వస్తుందని తెలిపారు. కల్లూరు, ఓర్వకల్ మండలాల్లో కమిటీ సభ్యులు పర్యటిస్తారని, ఇందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఉపాధి పనులను పరిశీలించడంతో పాటు కూలీలతో మాట్లాడటం, పండ్లతోటలు, అవెన్యూ ప్లాంటేషన్ తదితర వాటిని కూడా పరిశీలించే అవకాశం ఉందన్నారు. గుడ్ గవర్నెన్స్ కింద జాబ్‌కార్డుల అప్‌డేట్, పక్కాగా 7 రకాల రికార్డుల నిర్వహణ, వర్క్‌ఫైల్స్, వర్క్‌సైట్ బోర్డుల ఏర్పాటు తదితర వాటిపై దృష్టి సారించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు పీడీ సలీమ్‌బాషా, ఏపీడీలు కృష్ణమోహన్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్): రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2023 డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లను జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లాపరిషత్‌లోని చైర్మన్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ ముద్రించిన డైరీ, క్యాలెండర్లు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. డైరీలో ముద్రించిన జీవోల పుస్తకం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదాసిర్ అహ్మద్, నాయకులు గోవిందు, నాగరాజు, శేఖర్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: కళావా ని సాంస్కృతిక కళా సంస్థ క్యాలెండర్ –2023ను మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణ మూర్తి ఆయన స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో పరమ పదించిన ప్రముఖ కళాకారులు, ప్రస్తుత కళాకారుల ఫొటోలతో ప్రచురించడం అభినందనీయమన్నారు. కళాకారుల పట్ల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్ బాబుకు ఉన్న అభిమానం వ్యక్తం అవుతుందన్నారు. సీనియర్ కళాకారులు దస్తగిరి, తిరుపాలు, నాగేశ్వర రావు, ఆనందరావు, అనంత శర్మ, వెంకటేశ్వర్లు, హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.